ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





టిబి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు: ఇంటెన్సిఫైడ్ టిబి క్యాంపెయిన్ (టిబి ముక్తభారత్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా సెంట్రల్ జైల్లో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ ఎస్ కె ఖాదర్‌వల్లి సార్, జైల్ సూపరింటెండెంట్ డాక్టర్ సన్యాసిరావు డిప్యూటీ సూపరింటెండెంట్ మహేష్ ఆధ్వర్యంలో జైల్లో ఉన్న ఖైదీలకు టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఎవరికైతే ఎడతెరపలేదు దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం, ఆల్కహాల్ తీసుకోవడం, మధుమేహ వ్యాధిగ్రస్తులు, 60 సంవత్సరాల పైబడిన వారు ఎవరైతే ఉంటారో వారందరూ కూడా కఫం పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ కఫం పరీక్షల్లో క్షయ వ్యాధిని నిర్ధారణ అయితే క్షయ వ్యాధికి మందులు అన్ని ప్రాథమిక అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందజేస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా జైలు సిబ్బంది , టిబి నివారణ సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లాసంగా..ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-నెల్లూరు

రెవెన్యూ క్రీడలను ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడలను తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 10వ జిల్లా రెవెన్యూ క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు ఈనెల 13వ తేదీ వరకుజిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు అంశాల్లో క్రీడాపోటీలు జరుగనున్నాయి. ఆటల పోటీల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఆనంద్, ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ కార్తిక్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, రెవెన్యూ అధికారులు ఈ వేడుకల్లో పాల్గొని జ్యోతి ప్రజ్వలన, జాతీయ పతాకా విష్కరణ చేసి శాంతి కపోతాలను ఎగరవేశారు. తొలుత క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌గా అతిథులకు గౌరవవందనం చేశారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించిన కలెక్టర్, ప్రధాన న్యాయమూర్తి లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన సర్వీసులో తూర్పుగోదావరి జిల్లాలో పనిచేసినపుడు రెండుసార్లు రెవెన్యూ క్రీడల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిత్యం పనిఒత్తిడి, సమయానికి భోజనం కూడా లేకుండా రెవెన్యూ ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వుంటుందని, ఈ క్రీడలతో కాస్త మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ మూడురోజులు రెవెన్యూ ఉద్యోగులకు ఎటువంటి సమావేశాలు, టెలీ కాన్ఫరెన్సులు, వీడియోకాన్ఫరెన్సులు ఏమీ పెట్టడం లేదని, ఉద్యోగులందరూ ఉత్సాహంగా ఈ క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రీడలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ వారంలో కనీసం మూడురోజుల్కైనా క్రీడలు, వ్యాయామంపై దష్టిపెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికే రెవెన్యూ వ్యవస్థ తలమానికమన్నారు. దేశానికి తలసరి ఆదాయాన్ని చేకూర్చే శాఖ రెవెన్యూ శాఖ అని, ప్రజలకు ఆపదలొచ్చినా, విపత్తులొచ్చినా ముందుగా కనిపించే వ్యవస్థ రెవెన్యూవ్యవస్థ అని రెవెన్యూ శాఖ గొప్పతనాన్ని కొనియాడారు. సమాజంలో ప్రజలకు దగ్గరగా పనిచేసే ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులని, వారి కోసం ప్రత్యేకంగా ఈ క్రీడోత్సవాలు నిర్వహించడం చాలా మంచి నిర్ణయమన్నారు. ఈ క్రీడల స్ఫూర్తితో న్యాయశాఖలోని ఉద్యోగుల కోసం కూడా క్రీడలను నిర్వహించేందుకు ఆలోచన చేస్తామన్నారు. ఇంత గొప్పగా ఈ క్రీడలను నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మానసిక ఉల్లాసం, శారీరక దఢత్వం క్రీడలతో సాధ్యమని, రెవెన్యూ ఉద్యోగులందరూ ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధానన్యాయమూర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

వాలీబాల్ గేమ్ ఆడి ఉద్యోగుల్లో జోష్ నింపిన కలెక్టర్, జేసీ

రెవెన్యూ క్రీడల్లో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వాలీబాల్ పోటీలను ప్రారంభించి కాసేపు సరదాగా ఆడారు. వీరి ఆటతీరును చూసిన రెవెన్యూ ఉద్యోగులు ఆశ్చర్యపోయారు. కలెక్టర్, జేసీ అద్భుత క్రీడాప్రతిభను చూసిన ఉద్యోగులు చప్పట్లతో తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, నెల్లూరు, కావలి ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, కలెక్టరేట్ ఎఒ విజయకుమార్, అల్లంపాటి పెంచల్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కావలి, నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు డివిజన్ల రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రమోషన్ పొంది లేదా బదిలీ కాబడిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటున్నారని జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శేషులు, జి.వి చలపతి శర్మలు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఉపాధ్యాయులు బ్యాంకులకు చెల్లించాల్సిన నగదు తమ ఖాతాల్లో లేకపోవడం వల్ల చెక్ బౌన్స్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

బదిలీలు జరిగి నెల రోజులు గడిచిన పోస్టులను ఆన్లైన్ చేయటం డిఇఓ ద్వారా సిఎఫ్ఎంఎస్ కు పంపించలేదన్నారు. వారు పోస్ట్ లను సరిచేసి ఆర్గనైజేషన్ చేయాల్సి ఉండగా నేటి వరకు ఆపని పూర్తి కాకపోవడం వల్ల ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. ఉపాధ్యాయ జీతాలకు సంబంధించిన సమస్యపై జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఇప్పించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు.

చెత్తను తొలగించరూ..

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

మండలంలోని మొగులూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ప్రహరీ గోడ చుట్టూ పెద్ద ఎత్తున జంగిల్ పెరిగి ఉంది.అధికారులు అధికారులు పట్టించుకోవడంలేదు. జంగిల్ మధ్యలో విష సర్పాలు సంచరిస్తూ పిల్లల ప్రాణాలకు హాని కలిగే అవకాశం మెండుగా ఉందని గ్రామ ప్రజలు వాపోతున్నారు.వెంటనే సంబంధిత అధికారులు చెత్తను తొలగించాలని ఆప్రాంతవాసులు కోరుతున్నారు.

టిడిపి నాయకుడు ఆత్మహత్యాయత్నం

ఎంఎల్ఎ పట్టించుకోలేదని విమర్శ



మాట్లాడుతున్న బాషా

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని ముదివర్తి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఇమామ్ బాషా కు పార్టీలో కష్టపడి పనిచేసిన తనకు సరైన గుర్తింపు ఇవ్వలేదని పేర్కొన్నారు. శుక్రవారం ముదివర్తిలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఇమాంబాషా మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తాను టిడిపి పార్టీలో కష్టపడి పనిచేస్తున్న తన ఆస్తులు అమ్ముకుని పార్టీ ఎదుగుదలకు కృషి చేశానని తన బిడ్డ ఉద్యోగం చేసి వచ్చే జీతం డబ్బులు కూడా తాను టిడిపి పార్టీ కోసం ఖర్చుపెట్టిన బాకీలు తీర్చేందుకు ఈఎంఐ కడుతున్నానని వెల్లడించారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా పట్టుమని 100 మంది కూడా టిడిపి తరఫున వైసీపీకి ఎదురుగా నిలబడలేదని అలాంటి కష్ట కాలంలో కూడా టిడిపి కోసం తాను ఎంతో కష్టపడి పనిచేశానన్నారు. టిడిపిలో ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలిచేందుకు తనవంతు కషి చేశానని కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడి పనిచేసిన టిడిపి కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ ఎన్నో సంవత్సరాలుగా కష్టపడ్డా తనకు మాత్రం గుర్తింపు లేకుండా పోయిందన్నారు.నియోజకవర్గంలో ఏ చిన్న అభివద్ధి పని వచ్చిన ఎవరెవరికో కాంట్రాక్ట్ పనులు ఇస్తున్నారని వివాదరహితం, అవినీతి రహితంగా ఉండాలని ఎమ్మెల్యే చెప్పిన పిలుపుమేరకు కట్టుబడి ఉన్నానని కానీ తన ప్రాంతంలో అక్రమంగా విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే తానే అడ్డుకున్నారని అడ్డుకున్నందుకు తనపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నా ఊపిరి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ కోసమే పని చేస్తాను అని పురుగుల మందు తాగాడు, అనంతరం ఆయనను చికిత్స నిమిత్త అపోలో ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఇమాం బాషాను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది నుండి స్థానిక నాయకుడు రఫీ, ఇమాం బాషా మధ్య కొన్ని కారణాలతో గొడవలు జరుగుతున్నాయి. అయినప్పటికీ అందరు కలిసిమెలిసి పంచాయతీని అభివృద్ధి కోసం పనిచేయాలని విలేకరుల సమావేశంలో ఆమె తెలియజేశారు. **సైదాపురంలో మాట్లాడుతున్న దృశ్యం**

ప్రసన్న ఇంటిపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: కోరు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడి హేయమైన చర్య అని జిల్లా వైఎస్సార్సీపి విద్యార్థి విభాగం ఆశ్రిత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక డెకర్స్ రోడ్ లోని నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ కార్యాలయంలోఆయన మాట్లాడారు.

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ పేర్కొన్నారు.స్థానిక శ్రామిక భవన్‌లో శుక్రవారం మూడవ ఐద్వా మండల మహాసభ జరిగింది.ఈ మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమారి, ఎస్‌కె మస్తాన్‌బీ, సిఐటియు నాయకులు గడ్డం అంకయ్యలు పాల్గొన్నారు. ఈసందర్భంగా షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలన్నారు. మండలంలో పెండింగ్‌లోని మత్స్యకారేతర ప్యాకేజీని వెంటనే పంపిణీ చేయాలని, బెల్ట్ షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షులు శివకుమారి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉన్న చట్టాలను అమలు చేసే దాంట్లో పూర్తిగా విఫలమవుతున్నాయని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు ద్వారా చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలని, కుటుంబానికి 25 కేజీల బియ్యం, మూడు వేల రూపాయలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.సిఐటియు నాయకులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ మండలంలోని మహిళల సమస్యలపైన పోరాడేందుకు ముందుకు రావాలని, పెండింగ్‌లోని ప్యాకేజీ బ్యాలెన్స్ 18,050 రూపాయలు వెంటనే పంపిణీ చేసేందుకు మహిళలందరూ భవిష్యత్తులో జరిగే పోరాటాల్లో పాల్గొనాలన్నారు.కంపెనీల నుంచి ఇచ్చే సిఎస్‌ఆర్ నిధులను పొల్యూటర్స్ పే ప్రకారం ప్రతి కుటుంబానికీ నెలకు 30 కేజీల బియ్యం 3000 రూపాయల నగదును మండలంలోని ప్రతి కుటుంబానికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో పై సమస్యలపై పెద్ద ఎత్తున మండలంలో పోరాటాలు నిర్వహించాలని కోరారు.




మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ

నూతన కమిటీ

మహిళా సంఘం మండల కార్యదర్శి మన్నే పద్మమ్మ, అధ్యక్షులు ఆసాది మల్లమ్మ, సభ్యులు టి.లక్ష్మి, యు. పెంచలమ్మ, ఈపూర్ రమణమ్మ, ఎం. శంకరమ్మ, డి.నాగరత్నమ్మ, సిహెచ్ పద్మమ్మ, డి సులోచనమ్మ, పి సరోజనమ్మ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకునా

స్పోకెన్ ఇంగ్లీషు ప్రతిభను పెంచేందుకు కృషి

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణం పామూరు రోడ్ లోని బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్‌లో శుక్రవారం హౌస్ ఇనాగరేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంగ్లీష్ ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులను హౌస్ మాస్టర్స్ గా నియమించి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ ప్రతిభను పెంచే విధంగా విద్యార్థులను నాలుగు హౌసెస్ గా విభజించారు. ఈ సందర్భంగా..బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసించే ఇంగ్లీషు భాషలోని ప్రతిభను విద్యార్థులు సాధించాలని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి. బాలభాస్కర రావు మాట్లాడుతూ హౌస్ సిస్టం కాయిన్ సిస్టం ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడుతున్నారని,అంతే కాకుండా విద్యార్థులకి క్రమశిక్షణ కూడా మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, కాలేజీ డైరెక్టర్ బెజవాడ నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపల్స్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



-జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

'ప్రపంచ జనాభా దినోత్సవం'

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డు ప్రాంతంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టరు వి. సుజాత జెండా ఊపి ప్రారంభించారు. జనాభా పెరుగుదల వలన అనర్ధాలు, సురక్షిత మాతృత్వం వివిధ కుటుంబ నియంత్రణ పద్ధతుల పై వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదానాలతో ప్రజలకు అవగాహన, చైతన్యపరుస్తూ పొదలకూరు రోడ్డులోని సారాయి అంగడి సెంటర్ నుండి పొదలకూరు రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు..క్రార్యక్రమంలో డి ఐ ఓ డాక్టరు ఏ ఉమామహేశ్వరి, డిపిఎమ్ఓ డాక్టరు రమేష్, డి ఎం ఓ శ్రీమతి ఇ హుస్సేనమ్మ, వైద్యాధికారి డాక్టరు వీణాభారతి, ఆరోగ్యకార్యకార్తలు, ఆశాలు వివిధ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమిష్టిగా అందరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రాథమిక తరగతుల విద్యార్థినీ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఒ. ఆనంద్ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బడి పిల్లల ప్రావీణ్యత గురించి నిర్వహించిన పరాఖ్ సర్వేక్షన్ సర్వే, 2024 ఫలితాలపై ఉపవిద్యా శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో జిల్లా కలెక్టర్ విస్తతంగా చర్చించారు..జి ల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలోని 108 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 2,927 మంది విద్యార్థులు, 379 మంది ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొన్నారన్నారు.



మాట్లాడుతున్న అధికారి

ఎన్‌సిసి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని శ్రీ వివేక డిగ్రీ కాలేజీ లో 1878 ఎన్‌సిసి34బిఆంధ్ర బెటాలియన్ ఒంగోలు- 34బి ఎన్‌సిసి వారి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఫిబ్రవరిలో. ఒంగోలు వారు నిర్వహించిన "బి" సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ లో కందుకూరు శ్రీ వివేక డిగ్రీ కాలేజ్ ఎన్‌సిసి క్యాడెట్స్ 32 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నిర్వహించిన మాస్ డ్రిల్ ,రైఫిల్ డీల్, మాస్ రీడింగ్, మొదలగు పరీక్షలలో అత్యున్నతమైన ప్రదర్శన కనపరిచి 32 మంది 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో హవల్దార్ సుధీర్ కుమార్, హబల్దర్ గోపాలకృష్ణ బి సర్టిఫికెట్స్ కు ఇస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఉన్న భాస్కర రావు మాట్లాడుతూ మా కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ మంచి క్రమశిక్షణతో ఉన్నత విలువలతో శ్రీ వివేకా కళాశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంచే విధంగా ఉత్తీర్ణత సాధించారని తెలియజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి నరేంద్రబాబు, ప్రిన్సిపల్ అబ్బురి వెంకటేశ్వర్లు, బి శ్రీనివాసులు, ఎన్‌సిసి ఆఫీసర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించడం జరిగింది. కళాశాల అర్థశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపల్, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఏడుకొండల నరేంద్ర మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన జరుపుకుంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతూ జనాభా , లభ్యం అవుతున్న వనరుల మధ్య సమతుల్యత పాటించే విధంగా అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు.. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. రాజ్ గోపాల బాబు, కెమిస్ట్రీ అధ్యాపకురాలు డాక్టర్ ప్రశాంతి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీ కే. కరుణకుమార్ తదితరులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

నోట్‌పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: మేక్ ఏ చేంజ్ సొసైటీ కందుకూరు వారి సహకారంతో శుక్రవారం మండలంలోని ఓగూరులోని ఆది ఆంధ్ర కాలనీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్,నోటు పుస్తకాలు,బోధనా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మేక్ ఏ చేంజ్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారికి అవసరమైన విద్యాసామగ్రిని వారి సంస్థ ద్వారా అందిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, విద్యా సామాగ్రిని అందజేయడం ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు.కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు,ఇన్నమూరి శ్రీనివాసులు, కొత్త నరేంద్ర కుమార్, మనోహర్, నూక తోటి మాలిరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్కే ఆషా, కె.శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు: 31 డివిజన్ పరిధిలోని చవటమిట్ట ఎగువ ప్రాంతంలో డివైఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ యువతీ యువకుల సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ నిరంతరం పనిచేస్తూ స్థానిక సమస్యలను మన ప్రాంతంలో గుర్తించి అధికారులు దృష్టికి తీసుకొని పోయి పని చేయాలని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 31 డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎం సుధాకర్ సిపిఎం నెల్లూరు రూరల్ కమిటీ సభ్యులు బి నాగేశ్వర్ రెడ్డి మాదాసు ముత్యాలు డివైఎఫ్ఐ 9 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా వెంకట రమణయ్య, పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మెగా పేరెంట్స్‌డే

ప్రజాశక్తి-నెల్లూరు: కస్తూరిదేవి స్కూల్లో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఒ నరేష్ పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలు, ఉపాధ్యాయుల బాధ్యతలు తెలియజేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషిచేయాల న్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపా ధ్యాయు రాలు కామేశ్వరి, టీచర్స్, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఫ్రైడే..డ్రైడే

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని" కోటమిట్ట" పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని "విరాట్ నగర్" ప్రాంతాన్ని "ఫ్రైడే డ్రైడే" సందర్భంగా పట్టణ సబ్ యూనిట్ అధికారి ఎస్.సి. హెచ్ .రామా రావు పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఆరోగ్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ సీఓ ఆ కార్యక్రమం లో పాల్గొని ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ నివారణ చర్యలు ఇంటింటి లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆ ప్రాంత ప్రజలకు కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కోటమిట్ట ఆరోగ్యకేంద్ర లాబోరేటరీని తనిఖీ చేసి కీటకాజానిత వ్యాధుల రికార్డులను పరిశీలించి ,వైద్యాధికారి తో మాట్లాడి తగు చూచనలు , సలహాలు అందజేశారు.కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వి నాగార్జున రావు, సి ఓ కే వెంకటేశ్వర్లు,హెల్త్ సూపర్వైజర్ కె రమణి , ఏఎన్ఎం మంగమ్మ, ఆశాలు అనూష, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



సూపరిపాలన తొలి అడుగు

ప్రజాశక్తి-సైదాపురం: మండలం లోని అనంతమడుగు,లింగసముద్రం, గ్రామాల్లో సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగ డోర్ టూ డోర్ ప్రచారం లో పాల్గొని ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమల గురించి ప్రజలకు వివరించారు. సుపరిపాలన కరపత్రం అందించినవెంకటగిరి శాసన సభ్యులుకురుగొండ్ల రామకృష్ణ ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు జెన్నీరమణయ్య, మాట్లాడుతూ.రాష్ట్రంలో ని పంచాయతీ లో ఏమైనా అభివృద్ధి జరిగిందంటే చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరే ప్రభుత్వం చేయలేదన్నారు.కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, దిలీప్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, దామోదర్ నాయుడు, వెంకటకృష్ణంరాజు, కేపీ రాజు, తహశీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ రవీంద్ర బాబు, మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సైదాపురంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్: సిఎం ఆదేశాలమేరకు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని రావూరు గ్రామపంచాయతీ డోర్ టు డోర్ సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఉమ్మినేని సుబ్బారావు, చిత్తూరి మల్లికార్జున, పోలుగంగు కష్ణ, గొల్లపోల హరిప్రసాద్, గ్రామ నాయకులు, గొల్లపోలు సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడ్లూరు రూరల్‌లో

మాచర్లవారిపాలెం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని మా చర్లవారిపాలెం పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యాదాత నాయుడు ఆదికేశవుల రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పి4లో మాచర్ల వారిపాళెంను దత్తత తీసుకున్న ఎన్‌డిఆర్ గ్రూప్ అధినేత తెలిపారు. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 300 నివాసాలపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులకు విద్యాపరమై న సహకారం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, పేదల ఆర్థికాభి వృద్ధికి చర్యలు, ప్రభుత్వ పథకాల పై అవగాహన కల్పించి లబ్ధి పొందే లా చైతన్యం చేయడం తదితర బా ధ్యతలను ఎన్డీఆర్ గ్రూప్ చేపడు తుందని పేర్కొ న్నారు. ఇప్పటికే ఆదికేశవుల రెడ్డి పలు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆది కేశవులు రెడ్డికి సర్వేపల్లి శాసనస భ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేకంగా ధ న్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ నెల్లూరును స్మార్ట్ సిటీగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో ,సిటీ టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరు నగర కార్పొరేషన్లోనే 830 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.. డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టామన్నారు..అక్టోబర్ ఒకటో తేదీ నాటికి అన్ని పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు.అమృత్ స్కీం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందిస్తామని చెప్పారు.. ఏడాదిలోపు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు...సిటీలోని 13 హైస్కూల్స్ ను డిసెంబర్ కల్లా వి.ఆర్.సి తరహాలోనే ఆధునికీకరిస్తామని తెలిపారు.. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేస్తామని ..అదేవిధంగా అల్లీపురం డంపింగ్ యార్డ్ లో అన్ని హంగులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.. పినాకినిలో వాటర్ స్పోర్ట్స్ కి ప్లాన్ చేస్తున్నామన్నారు.ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే తిరిగి తీసుకుంటామని హెచ్చరించారు.సమీక్షలో కార్పొరేషన్ కమీషనర్ నందన్ ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కందుకూరు వలేటివారిపాలెం చుండి పంచాయతీ కాకర్ల పాలెం గ్రామానికి చెందిన బెజవాడ పురుషోత్తం, అమతమ్మ కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు.ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వీరికి పార్టీ కండువాలు కప్పి సాధారణంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లబోతుల అంకయ్య బోడ రమణయ్య నల్లబోతుల కొండలరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



విట్స్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



ప్రజాశక్తి-కావలి : విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు బిసినిప ఆరిఅ- 2025ను శుక్రవారం జెఎన్‌టియు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య డాక్టర్ శివకుమార్ ప్రారంభించి ప్రసంగించారు. రాబోవు రోజుల్లో సమాజానికి ఏఐ, ఇతర సాంకేతిక రంగాలలో గల అవసరాలను తెలియజేస్తూ విట్స్ కళాశాల నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సు బిసినిఎఐఆర్ఎ 2025 ఆయా రంగాల్లోని పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సుజన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పరిశోధనా పత్రాలు సమర్పించడానికి విద్యార్థులు, అధ్యాపకులు రావడం సంతోషకరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడానికి విట్స్ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ తెలియజేశారు. రోజురోజుకీ మారిపోతున్న ఈ ఆధునిక యుగంలో విద్యార్థులు, అధ్యాపకులకు కావలసిన విషయ పరిజ్ఞానాన్ని ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందిస్తున్నందుకు నిర్వాహకులను, అధ్యాపకులను చైర్మన్ రంగా రెడ్డి ప్రశంసించారు. ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ప్రత్యూష రెడ్డి, డాక్టర్ లిఖిత్ రెడ్డిలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి సునీల్ కుమార్, సిఎస్ఇ ఐటీ హెచ్‌ఒడి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కె.జి.బి.వి.లో ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆమె విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు జీవించే హక్కు, భావప్రకటన హక్కు, రక్షణ హక్కు బాలికల సంరక్షణ అభివృద్ధికి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని తనిఖీ చేసి పిల్లలతో కలిసి భోజనం చేశారు. దేశ నాయకుల జీవిత చరిత్రలను స్ఫూర్తిదాయకంగా తీసుకుని బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్, వంటగదులను, స్టోర్ రూములను పరిశీలించారు. పాఠశాల సిబ్బందితో సమావేశం చేసి అన్ని రికార్డులను పరిశీలించారు. ఆమెవెంట ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, జిసిడిఒ మమత, పాఠశాల టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

అసత్యపు వార్తలపై టిడిపి ఖండన



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పొంగూరు ఎస్‌సి కాలనీలో టిడిపికి చెందిన 70మంది వైసిపిలో చేరినట్లు కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తలు అవాస్తవమని టిడిపి ఎస్‌సిసెల్ ఉపాధ్యక్షులు నాగరాజు ప్రకాశ విలేకరుల సమావేశంలో తెలిపారు. గతంలో టిడిపిలో ఉన్నవాళ్లు కొంతమంది ఎన్నికలకు ముందే వైసిపిలో చేరినట్లు తెలిపారు. టిడిపి నుండి వైసిపిలో చేరినట్లు అవాస్తవమైన వార్తలు రాయడం సిగ్గుచేటన్నారు. టిడిపి కుటుంబ సభ్యులు అందరం కలిసే ఉన్నామని తెలియజేశారు. కొన్ని దుష్ట శక్తులు ఇలాంటి కుట్రలు చేస్తున్నాయని ఇలాంటి ఫేక్ వార్తలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెంచలరెడ్డి, ఉపసర్పంచ్ శివప్రసాద్, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

చెత్త కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం : ప్రతి ఇంటి నుండి హరిత రాయబారుల సహకారంతో తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి గ్రామపంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి కృషి చేయాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ కోరారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. హరిత రాయబారులు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించి ట్రై సైకిల్ ద్వారా ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలకు తరలించడాన్ని ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణారావు, సర్పంచ్ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు గెజిట్ నోటిఫికేషన్‌పై హర్షం

ప్రజాశక్తి-కావలి : జనగణనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయం బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక జెసి కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అద్దంకి ప్రభాకర్ మాట్లాడుతూ జనగణన చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల బీసీలు జనాభా ప్రకారం రాజకీయ, ఉద్యోగాల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న బీసీలకు రాజకీయపరంగా అవకాశాలు తక్కువ ఉండడం ఈ జనగణన తర్వాత అయినా బీసీలకు న్యాయం జరగాలని ఆయన కోరారు. సమావేశంలో బీసీ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం యం.వి.ఆర్.ఆర్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి గుడి భార్గవ్ 593 మార్కులు రాష్ట్ర స్థాయిలో 84 ర్యాంక్, జిల్లా స్థాయిలో 3వ ర్యాంక్ మరియు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వర్రావు రూ.10వేలు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ముజీర్ రూ.10వేలను అందించారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఎం.ఇ.ఒ సునీల్ విద్యార్థికి నగదును అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-కావలి : అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముసునూరు ప్రభుత్వ గిరిజన, బాలికల గురుకుల పాఠశాల, ముసునూరులో రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు, విశ్రాంత లెక్చరర్ ఎం.వి.ఎస్. ప్రసాదరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ జనాభా దినోత్సవ సందర్భంగా, గురుకుల పాఠశాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షత, విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి, షేక్.ఖాదర్ బాషా, మీకోసం సేవా సంస్థ రాయపాటి విడిసి కుమార్, బద్రి, ముఖ్య అతిథులుగా, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు. తదుపరి 8, 9, 10 తరగతుల బాలికలకు నిర్వహించిన వ్యాస రచనలో పి.అనూష, పి.తులసి, కె.లావణ్య ఎంపిక, పి.లావణ్య 10th, కె.జాహ్నవి, కె.చందన (డ్రాయింగ్), పి.పోలమ్మ, సి హెచ్. తేజస్విని, రిష్మా వారికి బహుమతులు, అతిథుల ద్వారా పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో మేరా యువభారత్ నెల్లూరు యూత్ ఆఫీసర్ మహేంద్ర రెడ్డి సహకారంతో హెల్ప్ సంస్థ డైరెక్టర్ వెంగలపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంతర్జాతీయ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జూనియర్ కాలేజీ విద్యార్థులతో అంతర్జాతీయ జనాభా దినోత్సవం ప్రాముఖ్యతను వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి డి.మహిత ఇంటర్ ఫస్టియర్ సిఇసి రెండో బహుమతి ఎస్.సంధ్య సీనియర్ ఇంటర్ సిఇసి, మూడో బహుమతి ఏ శ్రీకృష్ణ పదవ తరగతి కైవసం చేసుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను టి త్రివేణి, ఎస్.యామిని సీనియర్ ఇంటర్ విద్యార్థులు అందుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ షేక్ మౌలాలి, సివిక్స్ లెక్చరర్ శ్రీనివాసులు, కామర్స్ లెక్చరర్ జి సి రత్నయ్య, మోడల్ కాలేజీ ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం..

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సహకారంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని మాజీ సొసైటీ డైరెక్టర్, కావలి కాలువ,1 చైర్మన్, కండ్లగుంట మండలం నాయుడు అన్నారు. ఎస్‌ఎపిఎం కాలువ మెయిన్ రెగ్యులేటర్ వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌ఎపిఎం కాలువ ద్వారా కావలి కాలువకు వచ్చు నీరు తక్కువగా వస్తున్నాయని రైతులు, నీటి సంఘాల అధ్యక్షులు, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో శాసనసభ్యులు సంబంధిత అధికారులతో మాట్లాడి ఎస్‌ఎపిఎం కాలువ కింద ఉన్న బోగోలు, దగదర్తి, జలదంకి, డిఎండి ఎస్‌ఎపిఎం- 2 కాలువలకు 200 క్యూసెక్కుల నీటిని చివరి ఆయకట్టు వరకు విడుదల చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎపిఎం-1, ఎస్‌ఎపిఎం, 2. సిఎండి అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి, యాన్నబత్తిన రమణయ్య, కృష్ణారెడ్డి, హరిబాబు, కొండ లక్ష్మీనారాయణ, తాళ్లూరు, ఆదినారాయణ, కమ్మవారిపాలెం, రైతులు, ఎఎం మాధవ రావు, గిరిధర్, వెంకటేష్, రైతు నాయకులు పాల్గొన్నారు.

హమీద్ దారుణ హత్య

ప్రజాశక్తి-ఉదయగిరి : అలీ ఖైర్ ఫంక్షన్ హాల్ ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో హమీద్ దారుణ హత్య ఉదయగిరి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల బంధువుల వివరాల మేరకు.. ఇద్దరు యువకులు కత్తులతో దాడి చేయడంతో సంఘటన స్థలంలోనే హమీద్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటన ఫంక్షన్ హాల్ నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల కారణం అయి ఉండవచ్చని, విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఆశావర్కర్ల సమస్యలపై అలుపెరుగని పోరాటం

ప్రజాశక్తి-కావలి

ఆశావర్కర్ల యూనియన్ ఏర్పడిన గత 20 యేళ్ల నుంచి వారి సమస్యలను పరిష్కరించేందుకు అలుపెరుగని పోరాటం చేస్తున్నామనిఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. స్థానిక సిఐటియు ఆఫీసులో ఎ.పి. ఆశా వర్కర్స్ యూనియన్ కావలి పట్టణ 3వ మహాసభ ఎస్.వసుంధర అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పాల్గొని మాట్లాడుతూ ఆశావర్కర్స్ యూనియన్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఆశావర్కర్ల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నామన్నారు. పాలించే ప్రభుత్వాలు పనులు ఎక్కువ చేయించుకుంటున్నారన్నారు. వేతనాలు తక్కువ ఇస్తున్నారని, ఆశ వర్కర్‌కు నెలకు రూ.10వేలు వేతనం ఇస్తూ, పనిభారం మాత్రం ఎక్కువ పెంచారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఏరియా సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు కూడా ప్రభుత్వాలు ఇవ్వడం లేదని ఇది చాలా అన్యాయమన్నారు. విధి నిర్వహణలో అనారోగ్యాలతో ఎంతోమంది చనిపోయారని వీరి సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని పోరాటాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించుకుంటామని ఇందుకు ఆశా వర్కర్లు జరగబోయే పోరాటాలలో ఐక్యంగా పాల్గొనాలని పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, టి.వసుంధర దేవి, ఎస్.గాయత్రి మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పసుపులేటి పెంచలయ్య, అధ్యక్షులు ఎస్ గాయత్రి, ప్రధాన కార్యదర్శి టి వసుంధర దేవి, సహాయ కార్యదర్శి గిరేశమ్మ, కమిటీ సభ్యులు ఈ అన్నమ్మ, సిహెచ్ వరలక్ష్మి, సిహెచ్ సౌందర్య, ఎం రోజా, పి సుమతి, స్రవంతి డి.అదరత్తమ్ములు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు.



మాట్లాడుతున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

- ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలి
-ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన మొదటి సంవత్సరం అడ్మిషన్లు వెంటనే ఆఫ్లైన్లో నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని విఆర్‌సి సెంటర్, డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను.నరేంద్ర మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి వ్యవహరిస్తున్న తీరు రోజుకో మాట పూటకో విధానంలా ఉందన్నారు. డ్యూయల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చి ఆచరణలోకి వెళ్లకుండానే రివ్యూ జరిపి సింగిల్ మేజర్ విధానమే కొనసాగిస్తామని చెప్పడం హాస్యస్పదం అన్నారు. గత ప్రభుత్వ విధానాలను నిలదీసిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు అదే బాటలో అడుగులు వేస్తున్నారని గుర్తు చేసారు. రాష్ట్రంలో ఉన్న స్టేక్ హోల్డర్స్‌తో సంప్రదించకుండా ఇష్టానుసారంగా పూటకు ఒక నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడటమే అని దుయ్యబట్టారు. ఉన్నత విద్యా మండలి గతంలో చేసిన నిర్ణయానికి అనుగుణంగా డిగ్రీలో డ్యూయల్ మేజర్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెక్ట్‌లకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలని కోరారు. విద్యార్థి చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్ చేస్తున్న సందర్భంలో విద్యార్థులకు తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబందిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ చేస్తున్న ప్రాంతాలలో విద్యార్థులకు భద్రత ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోజురోజుకి డిగ్రీలో చేరే వారి సంఖ్య తగ్గుముకం పడుతున్న నేపథ్యంలో ఉన్నత విద్యామండలి వైఖరి డిగ్రీ విద్యను మరింత దిగజార్చే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అఫ్‌లైన్ పద్ధతిన డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, నాగేంద్ర, సుకుమార్, యశ్వంత్, లోకేష్, ధనుష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొవ్వొత్తులతో మహిళలు ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

కోవూరు నియోజకవర్గ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మహిళలు భారీగా తరలివచ్చి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ బెజవాడ గోపాల్ రెడ్డి పార్కు నుంచి వైఎస్ఆర్ బస్టాండ్ సెంటర్ వరకు సుమారు 500మందికి పైగా మహిళలు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలను గౌరవిస్తారో అక్కడ దేవతలు ఉంటారని పురాణాలు చెబుతున్నాయన్నారు. అటువంటి మహిళపై మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ భారీగా మహిళలు కదలి వచ్చి ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ర్యాలీ చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న కుమార్ రెడ్డి ఇష్టానుసారంగా, సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడిన వాక్యాలపై ఇంతవరకు జగన్మోహన్ రెడ్డి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మహిళలపై ఏమాత్రం గౌరవం లేని ఇటువంటి వ్యక్తులను పార్టీ నుంచి తొలగించి శిక్షపడేలా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. స్థానిక ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి మద్దతుగా మహిళలు భారీగా తరలివచ్చి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించినందుకు మహిళలందరికీ చైర్ పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వై.శివకుమార్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, మోర్ల మురళి, బత్తల హరికృష్ణ, ఎం వి శేషయ్య, తాళ్లస్వామి, దొడ్ల కోదండరామిరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ఎరువులు అందక రైతుల అవస్థలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఎరువులు అందక నియోజకవర్గంలోని రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్కు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 32 గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ ఈ గ్రామాల రైతులకు పలు రకాల సేవలను అందించే ఉద్దేశంతో స్థాపించబడిందన్నారు. ఎరువులు పురుగు మందులు ధాన్యం సేకరణ రైతులకు రుణాలు అందించే సదుద్దేశంతో స్థాపించబడిన సహకార సంఘం సొసైటీలో సుమారు 3000 మంది రైతులతో సభ్యత్వం కలిగి ఉందన్నారు. ఈ సొసైటీకి ఎన్నికలు కూడా జరుగుతాయన్నారు. ఎన్నికలు జరగని సమయంలో నామినేటెడ్ చైర్మన్, కమిటీ సభ్యులను నియమిస్తారని తెలిపారు. కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే సొసైటీ ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ అని, అయితే ఇంత విస్తృతమైన సేవలు అందించే ఈ సొసైటీకి జూన్ నుంచి ఇప్పటివరకు కేవలం 300 మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రం సరఫరా చేశారన్నారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఎఎస్‌పేటట, మర్రిపాడు, సంగం, చేజర్ల మండలాల్లోని పలు గ్రామాల రైతులు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ నందు సభ్యులుగా ఉన్నారన్నారు. ముందుగానే ధాన్యానికి గిట్టుబాటు ధర లేదని, ప్రభుత్వం సరిగా కొనుగోలు చేయదన్నారు. అయినప్పటికీ రైతులు వరి పంటను తప్ప మరి ఏ ఇతర పంటలను పండించే అలవాటు చేసుకోలేదన్నారు. ఒక ఎకరానికి నాలుగు కట్టల యూరియా వేయడం సాంప్రదాయకంగా రైతులు అలవాటు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు మాత్రం ఒక ఎకరాకు రెండున్నర కట్టలు యూరియా సరిపోతుందని రైతు సంఘం నాయకులకు తెలియజేశారు. రైతులు అడిగినంత యూరియాను ఇవ్వలేక అశాస్త్రీయమైన విధానాన్ని అవలంబించడం సరికాదని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అండగా రైతు సేవా కేంద్రాలను సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసినప్పటికీ ఏ ఒక్క సేవను కూడా అందించలేక దిష్టిబొమ్మలాగా రైతు సేవా కేంద్రాలు నిలిచి ఉన్నాయన్నారు. సుమారు 30 కిలోమీటర్ల దూరం నుంచి వ్యవసాయ పనులను నిలుపుకొని ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీకి యూరియా కోసం వస్తే కేవలం 5 ఎకరాలు 10 ఎకరాలు వేసుకున్న రైతులకు మూడు బస్తాల యూరియాను ఇస్తున్నారు. ఆ తక్కువ యూరియాను తీసుకునేందుకు కూడా తిరుపతి దైవ దర్శనం కోసం క్యూలలో నిలుచున్నట్లు నిలబడి ఒకరినొకరు నెట్టుకుంటూ ఆవేదన వ్యక్తపరుస్తూ ఉండడం వ్యవసాయంపై రైతాంగంపై ప్రభుత్వాల చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 8లక్షల ఎకరాల వరి సాగు చేస్తున్నారని, అయితే ఈ ఎడగారు సమయంలో కేవలం మూడు లక్షల 50 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందిస్తామని ఐఎబి మీటింగ్‌లో శాసనసభ్యులు మంత్రి ప్రకటించారన్నారు. వారు ప్రకటించిన మేరకు ఎరువులు పురుగుమందులు అందించాల్సిన పరిస్థితి ఉంది కానీ, వ్యవసాయ అధికారులు మాత్రం గ్రామీణ స్థాయిలో ఎటువంటి బాధ్యత తీసుకోకుండా జిల్లా అధికారుల మీదకు నెట్టడం పరిపాటి అయిందన్నారు. మంత్రి ఆనం జిల్లా అధికారులు జోక్యం చేసుకొని వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులకు అండగా నిలవాలని కోరారు.





కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

మునిరత్నం బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా ఎన్.మునిరత్నం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరులోని డిఎల్‌పిఒ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎఎస్‌పేట మండలానికి వచ్చినట్లు తెలియజేశారు.





నాగులవరం పిఎసిఎస్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-బిట్రగుంట

నాగులవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా చిలకపాటి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా కృషి చేస్తానని, రైతులకు వ్యవసాయ పరికరాలు విత్తనాలు ఎరువులు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోచిపాతల సంజయ్, సుభాని, నాగరాజు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- వరికుంటపాడు

వరికుంటపాడులో బెల్ట్ షాపులపై దాడులు చేయగా ఓ దుకాణంలో 43 బాటిళ్లు దొరికాయని ఎక్సైజ్ సిఐ మహమ్మద్ అబ్దుల్ జలీల్ తెలియజేశారు. షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలియజేశారు. అక్రమ మద్యం, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తూ. తూ. మంత్రంగా సాగిన ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కావలి

దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కావలి డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక పేరుతో కరెంట్ ఛార్జీలను విపరీతంగా పెంచుతూ, ఆదానీ స్మార్ట్ మీటర్ల బిగింపునకు మద్దతు ఇచ్చే, తూ.తూ. మంత్రంగా శుక్రవారం విద్యుత్ అదాలత్ జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి విమర్శించారు. ఈ అదాలత్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, గంటల కొద్దీ, కరెంట్ తీయడం డివిజన్లో నెలకొందని తెలిపారు. అయినాగానీ పెనాల్టీలు కూడా అన్యాయంగా వసూలు చేస్తున్నారని అదాలత్ జడ్జికి తెలిపారు. అదాలత్ చైర్ పర్సన్ ఆవిషయం తమ పరిధిలోనిది కాదని పేర్కొనడం సరైన విషయం కాదన్నారు. అదాలత్ అంటే వినియోగదారుల సమస్యలన్నింటినీ పరిష్కరించే వేదికగా ఉండాలని, ఆదానికి వత్తాసుగా ఉండరాదని అయన అన్నారు.



మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

సిపిఎం నాయకుడు మృతి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని కాగులపాడు పంచాయతీ శ్రీ రంగరాజపురం గ్రామంలో సిపిఎం కార్యకర్త ఎపి రైతు సంఘం గ్రామ కమిటీ కార్యదర్శి కోరికల కోటేశ్వర రావు శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని సిపిఎం నాయకులు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ ఎర్రశాలువా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలంటూ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, గరికపాటి సురేష్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.




ప్రజలే గుణపాఠం చెబుతారు..

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి.. ఇది ప్రజాస్వామ్యం అని గుర్తుపోట్టుకోవాలని, ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరున్నాయని వైసిపి మహిళా నాయకులు హెచ్చరించారు. కోవూరు పార్టీ కార్యాయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఆరుసార్లు ఎంఎల్ఎగా ప్రజలకు సేవలు అందించిన జిల్లాలో అతిపెద్ద కుటుంబంగా పేరొందిన నల్లపరెడి శ్రీనివాసులురెడ్డి కుమారుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కట్టి పడేయాలనే మాట్లాడుతున్నావని, దానిని బట్టే తమ ప్రవర్తన రాష్ట్ర ప్రజలకు తెలుస్తోందన్నారు. ఇది రాచరిక పాలన కాదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దాడి విషయం తెలియదని చెబుతున్నారని, అధికారంలో ఉన్న ఒక ఎంఎల్ఎకు దాడిపై కేసు నమోదు చేసి నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు కనివిని ఎరుగని రీతిలో ఇంట్లోకి చొరబడి కారు ధ్వంసం చేయడం, ఇంట్లో ఉన్న కోట్ల రూపాయలు వస్తువులను ఒక్కటీ వదలకుండా ధ్వంసం చేయడం రాక్షస పాలన గుర్తుకు తెస్తోందన్నారు. ప్రసన్న ఇంటిపై ముష్కరులు దాడి చేసి ఐదు రోజులు గడిచినా.. దాడికి పాల్పడిన వారు వివరాలు తెలిసినప్పటికీ వారి పట్ల ఎటువంటి చర్యలు తీసుకోలేదని సభ్యసమాజంలో న్యాయం జరగకపోవడంతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. మీరు కలిసి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద, అధికార ప్రతినిధి మళ్లీ నిర్మల, అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు వెంకట జ్యోతి, కొడవలూరు ఎంపీపీ జ్యోతి, కోవూరు జెడ్‌పిటిసి కవర్ గిరి శ్రీలత, సంపూర్ణ, షకీలా, ప్రవళిక, ఉమా, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నేతలు



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజల ఆలోచనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలువార్డులలో టిడిపి నాయకులతో కార్యకర్తలతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిపాలెంలో పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం టిడిపి మంచి పాలనకు సంకేతమన్నారు. అలాగే ఈ కార్యక్రమం గురించి ప్రతిఒక్క నాయకులు, కార్యకర్తలు తనవంతు బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి, కౌన్సిలర్ వేణు, సాగర్, తదితరులు ఉన్నారు.

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని కాగులపాడు వైద్యశాల వద్ద 7వ తేదీన జరిగిన కిడ్నాప్, కేసులో నిందితులుగా ఉన్న పదిమందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్లో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఆత్మకూరుకు చెందిన వాయుగుండ్ల రమేష్ మరియు దగదర్తికి చెందిన సురేంద్రబాబు 2004వ సంవత్సరం నుంచి బెంగళూరులో వ్యాపారం చేస్తుండగా ఈ వ్యాపార విషయమై ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాలు ఉండటంతో దగదర్తికి చెందిన సురేంద్రబాబు రమేష్ కదలికలను పసిగట్టి తన స్నేహితులతో కలసి 7వ తేదీన కాగోలపాడు వైద్యశాల వద్ద రమేష్ వెళుతున్న కారును అడ్డుకొని అందులో ఉన్న రమేష్‌ను తీసుకొని సురేంద్రబాబు తన కారులో తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం రమేష్ ను ఒక నిర్మానుష్య ప్రాంతంలో ఉంచగా అతను అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని ఎస్‌పి, డిఎస్‌పిలు దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు సకాలంలో నిందితులను నెల్లూరులో బుధవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న 11మందిలో పది మందిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరపరిచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు